

సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో గురువారం నాటికి 24.924 టీఎంసీలు ఉన్నాయి. 943 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం కొనసాగుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.61,800
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,550
3 శాతం జీఎస్టీతో	రూ.5,717
నవర (8 గ్రా)	రూ.45,736

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.0 /28.5

జిల్లా వ్యాప్తంగా గురువారం అక్కడక్కడా చిరుజల్లులు కురిశాయి. గాలిలో 53 శాతం తేమ ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది.

న్యూస్‌రీల్

'వైఎస్సార్ కాపు నేస్తం'కు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(వేదాయపాళెం): వైఎస్సార్ కాపు నేస్తం పథకానికి సంబంధించి కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలకు చెందిన 45 నుంచి 60 సంవత్సరాల మధ్య వయసున్న మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం కార్యనిర్వహణాధికారి వెంకటయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలు ఈనెల 22వ తేదీలోగా ఆయా గ్రామ, వార్డు సచివాలయాల్లో వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపిక ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్ల పర్యవేక్షణలో జరుగుతుందని తెలిపారు.

జిల్లాలో చిరుజల్లులు



మేఘావృతమైన ఆకాశం

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో గురువారం పలుచోట్ల చిరుజల్లులు కురిశాయి. ఆకాశం మేఘావృతమై వాతావరణం మారింది. ఆత్మకూరు, ఏఎస్‌పేట, సంగం, మర్రిపాడు, అనంతసాగరం, కలువాయి, వింజమూరు, ఉదయగిరితోపాటు నెల్లూరు నగరంలో పలుచోట్ల చిరుజల్లులు కురిశాయి.

న్యాయవాదుల సెమినార్ రేపు

నెల్లూరు(లీగల్): రాష్ట్ర బార్ కౌన్సిల్, నెల్లూరు బార్ అసోసియేషన్ సంయుక్తంగా న్యాయవాదుల సెమినార్‌ను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు నెల్లూరు పురమందిరంలో (టౌన్‌హాల్) ఈ కార్యక్రమం జరుగుతుందని, దీనిని రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి ప్రారంభిస్తారన్నారు. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మానవేంద్రనాథ్, జస్టిస్ రమేష్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు గంటా రామారావు, ఎ.రామిరెడ్డి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.యామిని, నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్ పాల్గొంటారని తెలియజేశారు. ఈ సెమినార్‌లో సివిల్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, పోక్సో, తదితర చట్టాలపై చర్చలు జరుగుతాయన్నారు. న్యాయవాదులు హాజరుకావాలని కోరారు.

భూ ఆక్రమణపై కలెక్టర్‌కు నివేదిక

నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానానికి సంబంధించి తోటపల్లిగూడూరు మండలం సౌత్‌ఆమలూరులో 3.5 ఎకరాల భూ ఆక్రమణ, రహదారి నిర్మాణంపై నివేదికను కలెక్టర్ హరినారాయణన్‌కు ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి గురువారం అందజేశారు. భూమి అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరారు. అనంతరం స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందజేశారు.

ఇండోర్ స్టేడియం రెడీ



- మొత్తం విస్తీర్ణం 150 ఎకరాలు
- రూ.8 కోట్లతో స్టేడియం నిర్మాణం
- మల్టీపర్పస్ కోర్టు ఏర్పాటు



మొగళ్లపాళెం స్పోర్ట్స్ విలేజీలో నూతనంగా నిర్మించిన ఇండోర్ స్టేడియం

మొగళ్లపాళెంలో స్పోర్ట్స్ విలేజ్‌కు శ్రీకారం

రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగా అనేక కార్యక్రమాలు చేపట్టింది. వేసవి శిక్షణా శిబిరాలను పక్కాగా నిర్వహించింది. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీలు జరిపి ప్రతిభ చూపిన వారిని ప్రోత్సహిస్తోంది. జిల్లాలోని క్రీడాకారుల కోసం మొగళ్లపాళెంలో స్పోర్ట్స్ విలేజ్‌కు శ్రీకారం చుట్టారు.



క్రీడాకారులకు త్వరలో అందుబాటులోకి..

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు నగరం నుంచి పొదలకూరు రోడ్డు వైపు 15 కిలోమీటర్ల దూరంలో మొగళ్లపాళెంలో స్పోర్ట్స్ విలేజ్‌కు శ్రీకారం చుట్టారు. వివిధ దశల్లో క్రీడలన్నీ ఒకే చోట జరిపేలా, జాతీయ స్థాయి పోటీలు నిర్వహించే విధంగా ప్రణాళికలు రూపొందించారు. క్రీడా రంగంలో విప్లవాత్మకంగా వచ్చిన సాంకేతిక మార్పులు, అత్యాధునిక మౌలిక వసతులు, క్రీడాకారులు శిక్షణకు, జాతీయ స్థాయి ప్రమాణాలతో పోటీల నిర్వహణకు అనుకూలంగా రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ (సీపీడబ్ల్యూ) వివిధ నిర్మాణాల బాధ్యతలను చేపట్టింది. తొలివిడతలో మల్టీపర్పస్ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం ఖేలో ఇండియా పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం, మినిస్ట్రీస్ ఆఫ్ యూత్ అఫైర్స్, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రూ.8 కోట్ల వ్యయంతో అత్యాధునిక స్టేడియం నిర్మాణం పూర్తి అయింది. త్వరలో ఇది క్రీడాకారులకు అందుబాటులోకి తేనున్నారు. రెండో విడతలో రూ.7.50 కోట్లతో 400 మీటర్ల సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేయనున్నారు.

స్టేడియం ఇలా..

మొగళ్లపాళెంలో స్పోర్ట్స్ విలేజ్ కోసం 150 ఎకరాలు కేటాయించారు. ఇందులో కొంత భాగంలో ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను నిర్మించారు. ఈ అత్యాధునిక ఇండోర్ స్టేడియంలో 12 బ్యాడ్మింటన్ కోర్టులు, 3 బాస్కెట్‌బాల్ కోర్టులు, 3 వాలీబాల్ కోర్టులు ఏర్పాటు చేశారు. ఒక కాన్ఫరెన్స్ హాలు, విశాలమైన డైనింగ్‌హాల్, స్త్రీ, పురుషులకు టాయిలెట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రత్యేక క్రీడా పోటీలను నిర్వహించే సమయంలో ఈ ప్రాంగణంలో ఏ పోటీలకు అవసరమైయ్యే ఆ కోర్టులను ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉంది. నెల్లూరు నుంచి క్రీడాకారులు సాధన చేసుకునేందుకు అనుకూలంగా ఉండడంతో ఈ ఇండోర్ మల్టీ కాంప్లెక్స్ స్పోర్ట్స్ స్టేడియం క్రీడాకారులకు వరంగా మారనుంది.



స్టేడియం లోపల వసతులు



మల్టీపర్పస్ కోర్టు

జిల్లాకు వరం



జాతీయ స్థాయి మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయడం నెల్లూరు జిల్లాకు వరం. అత్యాధునిక వసతులతో క్రీడాకారులు సాధన చేసుకోవచ్చు. పోటీల నిర్వహణకు అనుకూలం. త్వరలో మంత్రులు, శాప్ అధికారులతో ప్రారంభోత్సవం జరుగనుంది. విడతల వారీగా స్పోర్ట్స్ విలేజ్‌లో అన్ని క్రీడలకు అనువైన నిర్మాణాలను చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తోంది. క్రీడాకారులు అత్యాధునిక సదుపాయాలు ఉన్న స్టేడియంను వినియోగించుకుని క్రీడల్లో రాణించాలి.

– ఆర్‌కే యతిరాజ్, చీఫ్ కోచ్

క్రీడాకారులకు ఎంతో ఉపయోగం



అత్యుత్తమ ప్రమాణాలతో నిర్మించిన ఈ స్టేడియం వల్ల క్రీడాకారులకు ఎన్నో ఉపయోగాలున్నాయి. అంతర్జాతీయ స్థాయి శిక్షణ లభిస్తుంది. జాతీయ స్థాయి పోటీలు జరిగితే దేశ వ్యాప్త క్రీడాకారుల ఆటతీరును ఇక్కడి వారు పరిశీలించి మెరుగుపరుచుకునే అవకాశం ఉంటుంది. రాష్ట్రం విడిపోయిన నేపథ్యంలో ఇలాంటి స్టేడియం నిర్మాణం క్రీడల అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుంది.

– నిమ్మల వీర వెంకటేశ్వర్లు, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి

రూ. 18 లక్షల రికవరీకి ఆదేశం

- బ్రాహ్మణక్రాకలో పంట నష్టపరిహారం రూ.78.97 లక్షల మంజూరు
- వీఏఏ పొరపాటు కారణంగా ఇతరుల ఖాతాల్లో రూ.18.59 లక్షల జమ
- తప్పిదాన్ని సరిదిద్దుతున్న అధికారులు
- నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా చర్యలు



ఇటీవల జలదంకి ఏఓ కార్యాలయంలో వీఏఏను విచారిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

జలదంకి: మండలంలోని బ్రాహ్మణక్రాక పరిధిలో గతేడాది రెండో పంట దెబ్బతింది. దీనికి ప్రభుత్వం నష్ట పరిహారం అందించింది. అయితే ఆర్బీకే ఉద్యోగి చేసిన పొరపాటు వల్ల జాబితాలో లేని కొందరికి పరిహారం అందింది. ఈ విషయంపై స్థానిక రైతులు కలెక్టర్ ఎం.హరినారాయనన్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన ఆదేశాలతో విచారించి అనర్హుల ఖాతాల్లో నుంచి నగదు రికవరీకి ప్రయత్నిస్తున్నారు. అయితే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి జిల్లాలో పంట నష్టపరిహారం రూ.కోట్లు పక్కదారి పట్టిందంటూ విషపు రాతలతో ప్రభుత్వంపై నింద మోపేందుకు ఎల్లో మీడియా ప్రయత్నాలు చేస్తోంది.

ఇదీ జరిగింది

బ్రాహ్మణక్రాక రైతు భరోసా కేంద్రం పరిధిలో 2022 సంవత్సరంలో 58 మంది రైతులు రెండో పంట నష్టపోయారు. మొత్తం 359.0 ఎకరాలకు సంబంధించి రూ.78.97 లక్షలను పంట నష్టపరిహారం కింద ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే వివరాల నమోదులో వీఏఏ ప్రత్యూష చేసిన పొరపాటు వల్ల పంట నష్టం జరగని రైతులకు పరిహారం సొమ్ము జమైంది. నిజంగా నష్టపోయిన రైతుల పేర్లు లేకపోవడంతో వారంతా వీఏఏను నిలదీశారు. ఆమె నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు మూడురోజుల క్రితం జలదంకి ఏఓ కార్యాలయంలో వీఏఏ, వలంటీర్లను విచారించారు. రెండురోజుల పాటు విచారణ జరిపిన అధికారులు 25 మందిని అనర్హులుగా గుర్తించారు. వీఏఏ పొరపాటు వల్ల 25 మంది రైతుల ఖాతాల్లో రూ.18.59 లక్షలు జమైందని తేల్చారు. ఆ నగదు రికవరీకి ఆదేశించారు.

రైతులకు న్యాయం చేస్తాం

బ్రాహ్మణక్రాక ఆర్బీకే పరిధిలో నిజంగా నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తాం. ఇప్పటికే వీఏఏ, వలంటీర్లను విచారించాం. 25 మందికి నగదు జమైనట్లు తెలిసింది. రికవరీకి ఆదేశాలిచ్చాం.

– సుధాకర్‌రాజు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

ఓటర్ల జాబితా తయారీకి సహకరించండి

- కలెక్టర్ ఎం.హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): ఓటర్ల జాబితా తయారీకి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ కోరారు. నెల్లూరులోని కలెక్టర్ కార్యాలయ శంకరన్ హాల్లో వివిధ రాజకీయ పార్టీలతో గురువారం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21 నుంచి బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ తిరిగి ప్రస్తుతం ఉన్న ఓటర్ జాబితాలో మార్పులు, చేర్పులకు సంబంధించిన సమాచారం సేకరిస్తారని తెలిపారు. బూత్ స్థాయిలో ఏజెంట్లు వారికి సహకరిస్తే కచ్చితమైన జాబితా తయారవుతుందన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు ప్రతి పోలింగ్ స్టేషన్‌కు బూత్ లెవల్ ఏజెంట్‌ను నియమించాలని కోరారు. ప్రస్తుతం ఉన్న జాబితాలో నమోదు కాని వారు, కొత్తగా నమోదు కావాల్సిన వారు, నివాసం మారిన వారు, ఇంకా చనిపోయిన వారి సమాచారాన్ని సేకరించి జాబితాలో తప్పులను సరిచేయడానికి చర్యలు తీసుకుంటారన్నారు. ఒకే ఇంట్లో పదిమందికి పైగా ఓటర్లు, వంద సంవత్సరాలు దాటిన ఓటర్లుంటే క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్‌ను అక్టోబర్ 10 నాటికి పబ్లిష్ చేస్తామని, 17 నుంచి నవంబర్ 31 వరకు క్లైమ్‌లు, అభ్యంతరాలు చేసుకోవచ్చన్నారు. డిసెంబర్ 26 నాటికి వాటిని పరిష్కరిస్తామన్నారు. వచ్చే ఏడాది జనవరి 5న తుది జాబితా ప్రకటిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఎక్కడైనా పోలింగ్ స్టేషన్లు మార్పు చేయాల్సి ఉన్నా, ఓటరు జాబితా సవరణలో సమస్యలున్నా వీఆర్వోల దృష్టికి తీసుకెళ్లాలన్నారు.



మాట్లాడుతున్న హరినారాయణన్

- జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ మాట్లాడుతూ ఎన్నికల సంఘం జూన్ 1వ తేదీ నుంచి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. నెలరోజులపాటు బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరిగి జాబితాలో తప్పులను గుర్తించి సరిదిద్దుతారన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నుంచి మురళీధర్‌రెడ్డి, టీడీపీ నుంచి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, భువనేశ్వర ప్రసాద్, బీజేపీ నుంచి వై.రాజేష్, శ్రీనివాస్ కాంగ్రెస్ నుంచి షేక్ ఫయాజ్, సీపీఎం నుంచి మోహన్‌రావు, ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి జి.సత్తార్ తదితరులు పాల్గొన్నారు. ఒకే ఇంటికి సంబంధించిన ఓట్లు వేర్వేరు పోలింగ్ బూత్‌లలో ఉంటున్నాయని, ఒకేచోట ఉండేలా చూడాలని పలువురు కోరారు.

ఎస్‌ఆర్‌కే ద్వారా అధిక రుణాలు



మాట్లాడుతున్న ఆర్‌ఎం మోహన్‌రెడ్డి

నెల్లూరు(పొగతోట): సరళ రుణ కేంద్రం (ఎస్‌ఆర్‌కే) ద్వారా అధిక మొత్తంలో రుణాలు మంజూరు చేయనున్నట్లు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ (ఏపీజీబీ) ఆర్‌ఎం టి.మోహన్‌రెడ్డి తెలిపారు. నెల్లూరులోని జెడ్పీ సమావేశ మందిరంలో గురువారం ఏపీజీబీ ఫీల్డ్ ఆఫీసర్లకు నిర్వహించిన సమావేశంలో ఆర్‌ఎం మాట్లాడారు. నెల్లూరు, కావలి ప్రాంతాల్లో ఎస్‌ఆర్‌కేలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాటి ద్వారా హౌసింగ్, విద్య తదితర అవసరాలకు అధిక మొత్తంలో రుణాలు మంజూరు చేస్తారన్నారు. డీజీ ఖాతా ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నట్లు చెప్పారు. రికవరీలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పెద్ద వారు ఏదో ఒక విధంగా ఎక్కడో ఒక చోట రుణాలు మంజూరు చేయించుకుంటారన్నారు. పేద ప్రజలు బ్యాంక్‌లను దేవాలయాల్లా భావిస్తారని వారిని చిన్నచూపు చూడొద్దన్నారు. సమావేశంలో ఎస్‌ఆర్‌కే వి.కిశోర్, ఏపీజీబీ సీనియర్ మేనేజర్లు జయశంకర్, అజయ సింహారెడ్డి, ఏఓ చక్రధర్, మేనేజర్లు పాల్గొన్నారు.

రొట్టెల పండగకు ముమ్మరంగా ఏర్పాట్లు



దర్గా ప్రాంగణంలో పర్యటిస్తున్న కమిషనర్ వికాస్ మర్మత్, అధికారులు

- కమిషనర్ వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): ఈనెల 29వ తేదీ నుంచి నెల్లూరు బారాషహీద్ దర్గా రొట్టెల పండగ నేపథ్యంలో ఏర్పాట్లను ముమ్మరంగా చేస్తున్నామని కమిషనర్ వికాస్ మర్మత్ తెలిపారు. గురువారం ఆయన పలువురు అధికారులతో కలిసి దర్గాలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధిక సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో దర్గా ప్రాంగణంలో అన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు. ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ట్రాఫిక్ సమస్య రాకుండా పోలీస్ శాఖ తగిన ఏర్పాట్లు చేస్తోందన్నారు. అదే విధంగా దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్‌కు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. ముఖ్యంగా స్వర్ణాల చెరువు వెంబడి భద్రతా చర్యలు, పారిశుద్ధ్యం వంటి వివిధ అంశాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీఎస్పీ అబ్దుల్ సుబహాన్, ఎస్‌ఈ సంపత్‌కుమార్, డీసీపీ దేవికుమారి, ఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ, కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మా 'నేస్తం' నువ్వే..

వైఎస్సార్ నేతన్న నేస్తం కార్యక్రమానికి అధికారులు సర్వం సిద్ధం చేశారు. ముఖ్యమంత్రి హోదాలో మొదటిసారి వెంకటగిరికి వస్తున్న ప్రియతమ నేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అపూర్వ స్వాగతం పలికేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. సభకు హాజరు కానున్న నేత కార్మికులకు సకల వసతులు కల్పించారు. వేలాది మంది కూర్చొని వీక్షించే విధంగా సభావేదికను అందంగా ముస్తాబు చేశారు.

- నేడు వెంకటగిరిలో 'వైఎస్సార్ నేతన్న నేస్తం'
- బటన్ నొక్కి నగదు జమచేయనున్న సీఎం వైఎస్ జగన్
- భారీ ఏర్పాట్లు చేపట్టిన అధికార యంత్రాంగం



వెంకటగిరిలో సభా ప్రాంగణం

వెంకటగిరి: ఉమ్మడి నెల్లూరు జిల్లా వెంకటగిరి పట్టణంలోని ఎస్‌ఎల్‌ఆర్ కల్యాణ మండపం సమీపంలో ఉన్న మైదానంలో వైఎస్సార్ నేతన్న నేస్తం కార్యక్రమాన్ని శుక్రవారం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అట్టహాసంగా ప్రారంభించనున్నారు. నేతన్నలకు ఐదో విడత మొత్తాన్ని బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమచేయనున్నారు. ఈ మేరకు అధికారులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఉపముఖ్యమంత్రి కె.నారాయణస్వామి, వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, సీఎం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదన్ రెడ్డి, కోనేటి ఆదిమూలం, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి, నియోజకవర్గ పరిశీలకులు సత్యనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం తదితర నేతలతోపాటు, కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, ఎస్పీ రమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా చేనేత కార్మికులు హాజరుకానున్న నేపథ్యంలో అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. హెలీప్యాడ్ ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి క్రాస్ మీదుగా వైఎస్సార్ ప్రాంగణం వరకు రోడ్డు మార్గాన భారీ ఎత్తున స్వాగత ఏర్పాట్లు చేశారు.

- బహిరంగ సభా ప్రాంగణం వద్ద సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేనేత కార్మికులతో ముచ్చటించనున్నారు. వారితో కలిసి ఫొటోషూట్ కార్యక్రమంలో పాల్గొంటారు. సీఎం పర్యటన నేపథ్యంలో గురువారం ఎస్పీ పరమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ట్రయల్ రన్ నిర్వహించారు.
- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంకటగిరి పర్యటన నేపథ్యంలో 1,500 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ మేరకు స్థానిక ఎస్‌ఎల్‌ఆర్ కల్యాణ మండపంలో బందోబస్తులో పాల్గొనే సిబ్బంది, పోలీసు ఉన్నతాధికారులతో ఎస్పీ సమావేశం ఏర్పాటు చేసి దిశానిర్దేశం చేశారు. హెలీప్యాడ్ నుంచి సభాప్రాంగణం వరకు సీఎం రోడ్డు మార్గాన రానున్న నేపథ్యంలో ఆ మార్గంలో విధుల్లో ఉండే పోలీసులు సమయస్ఫూర్తితో వ్యవహరించాలని సూచించారు. అదనపు ఎస్పీలు వెంకటరావు, కులశేఖర్, మునిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా కల్యాణోత్సవం

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో కోటి కుంకుమార్చన మహాయజ్ఞంలో భాగంగా గురువారం రాత్రి గంగ, కామాక్షితాయి సమేత మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. ఉదయం వివిధ పూజలను నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై 100 మంది రుత్వికుల చేత కోటి కుంకుమార్చన మహాయజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు, ఈఓ వెంకటేశ్వర్లు, పాలకమండలి సభ్యులు నందకుమార్, రఘురామయ్య, శివకుమార్, పద్మమ్మ, సుప్రజ, కామేశ్వరి, విమలమ్మ, శశిశేఖర్‌శర్మ, ఉభయకర్తలు పాల్గొన్నారు.



ప్రత్యేకాలంకరణలో స్వామి, అమ్మవార్లు

సీహెచ్‌సీని పరిశీలించిన వైద్య బృందం


రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్లు

వెంకటాచలం: మండల కేంద్రమైన వెంకటాచలంలోని క్లస్టర్ ఆరోగ్య కేంద్రాన్ని (సీహెచ్‌సీ) కేంద్ర ప్రభుత్వం తరపున కేరళ డాక్టర్ల బృందం గురువారం పరిశీలించింది. ఆస్పత్రిలోని గదులు, వసతులు, పరిసరాలను బృంద సభ్యులైన వైద్యులు సరిత, సాజిద తదితరులు క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే సీహెచ్‌సీకి వచ్చే రోగులకు సంబంధించిన రికార్డులను చూసి, సేవల గురించి ఆరా తీశారు. వైద్య సేవలు ఏ విధంగా అందుతున్నాయో తెలుసుకునేందుకు జిల్లాలో పర్యటిస్తున్నట్లు డాక్టర్ సాజిద తెలిపారు.

వీడిన పెయింటర్ హత్య కేసు మిస్టరీ

- వివాహేతర సంబంధమే కారణం
- ముగ్గురు నిందితుల అరెస్ట్


వివరాలను వెల్లడిస్తున్న సీఐ సంగమేశ్వరరావు

మనుబోలు: మండలంలోని చెర్లోపల్లి గ్రామానికి చెందిన పెయింటర్ చీకిరి రవిబాబు (40) హత్య కేసును మనుబోలు పోలీసులు ఛేదించారు. వివాహేతర సంబంధమే కారణంగా తేలింది. హత్య చేసిన కుడితిపల్లి గ్రామానికి చెందిన ఆమారపు మంగమ్మ, ఆమె కుమారుడు ప్రశాంత్ కుమార్, మేనల్లుడు ఓజిలి గ్రామానికి చెందిన శివరాజాను గురువారం అరెస్ట్ చేశారు. మనుబోలు పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. రవిబాబు స్వగ్రామం వెంకటాచలం మండలం తిక్కవరప్పాడు పంచాయతీ పరిధిలోని జోసఫ్‌పేట. అయితే తన తల్లి స్వగ్రామమైన చెర్లోపల్లిలో ఉంటూ పెయింట్ పనులకు వెళ్లేవాడు. అతను తన భార్యకు విడాకులిచ్చాడు. ఈ క్రమంలో చెర్లోపల్లి పక్క గ్రామం కుడితిపల్లికి చెందిన వితంతువు ఆమారపు మంగమ్మతో కొన్నేళ్ల క్రితం వివాహేతర సంబంధం ఏర్పడింది. అయితే ఆరునెలల నుంచి ఇద్దరి మధ్య గొడవలున్నాయి. ఇది పోలీస్‌స్టేషన్ వరకూ వెళ్లింది. ఈనెల 16వ తేదీన రాత్రి రవిబాబు మంగమ్మ నివాసానికి వెళ్లగా ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. అ సమయంలో ఇంటికొచ్చిన మంగమ్మ కుమారుడు ప్రశాంత్‌కుమార్ ఇంటి నుంచి వెళ్లిపోవాలని రవిబాబును హెచ్చరించాడు. అతను లెక్క చేయకపోవడంతో ఇనుప పైప్‌తో కొట్టాడు. మంగమ్మ కత్తితో రవిబాబును పొడిచి హత్య చేశారు. ఈ కేసు నుంచి బయటపడేందుకు ఆమె ఓజిలి గ్రామానికి చెందిన తన మేనల్లుడు శివరాజాను పిలిచింది. మృతదేహాన్ని చాపలో చుట్టి మోటార్‌బైక్‌పై తీసుకెళ్లి బండేపల్లి బ్రాంచ్ కెనాల్‌లో పడేశారు. ముగ్గురూ కలిసి ఓజిలికి పారిపోయా రు. రవిబాబు హత్య గురించి అతని తల్లి సుజాతమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేశారు. వారి ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన నేరాన్ని ఒప్పుకున్నారు. హత్య కేసును ఛేదించిన పోలీసులను డీఎస్పీ వీరాంజనేయ రెడ్డి అభినందించి రివార్డులు ప్రకటించారని తెలియజేశారు. సమావేశంలో ఎస్సై అజయ్‌కుమార్, హెడ్ కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, మణి రాజగోపాల్, కానిస్టేబుళ్లు మాధవ్, నరేష్ పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగి ఆత్మహత్య


చెంచయ్య ఆచారి మృతదేహం

నెల్లూరు(క్రైమ్): విశ్రాంత ఉద్యోగి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నెల్లూరు లక్ష్మీపురంలో గురువారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. లక్ష్మీపురంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో విశ్రాంత ఇరిగేషన్ ఉద్యోగి చెంచయ్య ఆచారి (65), కోటేశ్వరమ్మ దంపతులు నివాసం ఉంటున్నారు. వారి కుమారుడు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తుండగా, కుమార్తెకు వివాహమై నెల్లూరులోనే ఉంటోంది. చెంచయ్య కొంతకాలంగా ప్రోస్టేట్ గ్రంథి సమస్యతో బాధపడుతూ శస్త్రచికిత్స చేయించుకున్నా డు. ఈ క్రమంలోనే ఆయన మానసికఒత్తిడికి లోనయ్యాడు. తోబుట్టువులు చనిపోవడాన్ని చూసి తాను చనిపోతానని అంటూ ఉండేవాడు. కుటుంబసభ్యులు ధైర్యం చెబుతూ వచ్చారు. చెంచయ్య చెల్లెలు ఐదునెలల క్రితం చనిపోయింది. అయన మానసికస్థితిని చూసి కుటుంబ సభ్యులు ఈ విషయం చెప్పలేదు. గురువారం ఉదయం గుడికి వెళ్లేందుకు భార్యను లేపాడు. ఈ క్రమంలోనే తన బావ సుబ్బారావు చనిపోయాడని చెంచయ్యకు ఫోన్ వచ్చింది. ఈ విషయాన్ని ఆయన తన భార్యకు చెప్పి స్నానానికి వెళ్లాడు. ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో భార్య లోనికి వెళ్లిచూడగా ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని కనిపించాడు. ఆమె దగ్గరకు వెళ్లి పరీక్షించగా అప్పటికే చనిపోయాడు. దీంతో కోటేశ్వరమ్మ జరిగి న విషయాన్ని తన కుమార్తెకు తెలియ జేసింది. కుమార్తె ఇంటికి వచ్చిన తర్వా త ఇద్దరూ కలిసి మృతదేహాన్ని కిందకు దించి నవాబుపేట పోలీసులకు ఫిర్యా దు చేశారు. ఇన్‌స్పెక్టర్ టీవీ సుబ్బారావు, ఎస్సై తిరుపతయ్య ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కోటేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

మాజీ పీఠాధిపతిపై కేసు నమోదు

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని ఖాజా నాయబ్ రసూల్ దర్గా మాజీ పీఠాధిపతి హఫీజ్ పాషాపై పోలీస్ కేసు నమోదైంది. రెండు రోజుల క్రితం దర్గా గలేఫాలు తీసుకెళ్లే విషయంలో వివాదం నెలకొంది. తనపై దౌర్జన్యం చేశారంటూ దర్గా ఈఓ హుస్సేన్ బాషా పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఏఎస్‌పేట ఎస్సై నరేష్ గురువారం హఫీజ్ పాషా, మరికొందరిపై కేసు నమోదు చేశారు.

పాలిటెక్నిక్‌లో తక్షణ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(టౌన్): డిప్లొమాలో నేరుగా రెండో సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఐపీసీ, ఐటీఐ చదివి బ్రిడ్జి కోర్సు పాసై కౌన్సెలింగ్‌లో సీటు రానివారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. చేరాలనుకున్న కళాశాలలో వాటిని ఈనెల 23వ తేదీలోపు అందజేయాలన్నారు. 24న నెల్లూరు వెంకటేశ్వపురంలోని ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. హాజరయ్యే వారు పదో తరగతి, ఇంటర్మీడియట్ (ఐపీసీ) లేదా ఐటీఐ బ్రిడ్జి కోర్సు పాసైన ధ్రువీకరణపత్రాలు, స్టడీ, ఆదాయ, కుల సర్టిఫికెట్లు, ఆధారకార్డు, మూడు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకురావాలని సూచించారు. బోధన ఫీజు రూ.5,500 చెల్లించాలన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 115
లేయర్ (లైవ్)	: 92
బ్రాయిలర్ చికెన్	: 204
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 228
లేయర్ చికెన్	: 156

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.25
సన్నవి	: రూ.12
పండ్లు	: రూ.5

